# తెలుగు నాటకంలో సమయశిల్పం

''నాటక సమయాలు'' అన్న పదాన్ని నాందీప్రస్తావనాదులను, సంధి, సంధ్యంగాలను ఇతివృత్త నిర్మాణంలో ప్రదర్శించవలసిన తీరును గురించి చర్చించే సమయంలో ప్రయోగించారు భరతాదులు. ఇతివృత్తాన్ని అంకాలుగా విభజించడానికి కాలాన్ని, ఆ కాలానుబద్ధమైన సన్నివేశాలను ఉపయోగించారు సంస్కృత నాటకకర్తలు. వాటిని సంధులన్నారు. అంతకన్న సూక్ష్మంగా విశ్లేషించడానికి సంధ్యంగాలను కూడా నియోగించుకున్నారు.

ఆధునిక నాటక సమయాల్లో నాందీ ప్రస్తావనాదులకు ప్రాముఖ్యం లేదు. సంధుల ప్రసక్తే లేదు. అయినా సన్నివేశ నిర్మాణంలో కాలానికున్న ప్రాముఖ్యతని మాత్రం వారు గమనించక తప్పలేదు. ''సమయం'' అన్న కాలపరిమాణాన్ని నాటకకర్త - ఒక్క నాటకకర్తే అనేమిటి? - సృజనాత్మక సాహిత్య సృష్టికర్త అయిన ప్రతివాడూ - దృష్టిలో ఉంచుకోక తప్పదు. దాన్ని ఏదోవిధంగా ప్రయుక్తం చేయకా తప్పదు.

నిజానికి యీ సమయశిల్పం - కాలగమన పరిశీలన. కాలపరిమాణ విశ్లేషణ - ఆధునిక ప్రపంచ నవలా సాహిత్యంలో ఒక సంక్లిష్టమైన శిల్ప నిర్మాణం. ఈ శిల్పాన్ని నవలల్లో ప్రయుక్తం చేసినంత విస్తృతంగా నాటకాల్లో చెయ్యకపోవడానికి కారణం ఆయా ప్రక్రియల్లో ఉన్న వైవిధ్యమే! నవలలో రచయితో, లేదా ఒక వ్యాఖ్యాతో కథాకథనాన్ని సాగిస్తాడు. అప్పుడు వాఖ్యాత ఒక నిర్ణీత సమయంలో ఉండి, తాను దర్శించిన సన్నివేశాలను అంతకుముందు సమయంలో - గతంలో - జరిగినట్లు వివరిస్తాడు. అంటే - వర్తమానంలో ఉన్న కథకుడు, జరిగిపోయిన కథను వివరిస్తున్నాడు - 'కథ అలా జరిగింది', 'వాడు అట్లా అన్నాడు' అన్న గతస్ఫోరకాలైన విషయాలతో - ప్రధాన పాత్రధారే కథాకథనం చేసే సమయాల్లో తప్ప - మరి అన్ని సన్నివేశాల్లోనూ కథకుడు, పాత్ర లేదా పాత్రల దృష్టిలో సమయ వైవిధ్యం ఉండక తప్పదు. నాటకంలో అలాకాదు. గతంలో జరిగిన కథనయినా దృశ్యపరికల్పన చేసి చూపుతున్నప్పుడు 'అది యిప్పుడు జరుగుతున్నది' అనే భ్రాంతిని కలగచేస్తుంది నాటకం. అంటే - వర్తమాన కాల పరిధికి ప్రతిసంఘటననూ పునర్నిర్మించి చూపుతుంది నాటకం. కథనాత్మకమైన నవలకీ, దృశ్యమానమైన నాటకానికి సమయశిల్ప ప్రయోగంలో ఉన్న యీ వైవిధ్యం వల్లనే నవలల్లో ఉపయోగించినంత సంక్లిష్టంగా కాలపరిమాణాన్ని నాటకాలలో ఉపయోగించడం కుదరదనిపిస్తుంది.

అయితే ఏకథకూ ఏదో ఒక కాలగమన పద్ధతిని అనుసరించకుండా చెప్పడం కుదరదు. E.M. Forster చెప్పినట్టు ప్రతిసృజనాత్మక సృష్టి జరిగేటప్పుడూ ఎక్కడో గడియారం టిక్, టిక్ శబ్దం వినిపిస్తూనే వుంటుంది. కొందరు రచయితలు గడియారాన్ని పరిగెత్తిస్తారు; మరికొందరు నత్తనడకలు నడిపిస్తారు. కొందరు గడియారం ముళ్ళని ముందరకో, వెనక్కో తిప్పుతూ వుంటారు. కాని గడియారాన్నే వాడని రచయితే లేడు - అంటాడు **Forster.** అంతేకాదు, ప్రతి రచయితా తన రచనద్వారా 'చరిత్ర'కు జవాబుదారీ అవుతాడు. తన రచన భూత భవిష్యద్వర్తమాన కాలాల్లో ఏదో ఒక కాలానికి చెంది వుండడం వల్ల, తాను ఏ కాలంలో తన సంఘటనలని నియమితం చేస్తాడో, ఆ కాలానికి అనుగుణమైన స్థితిగతులను కలిగించాలి. తాను వాడిన ప్రతిమాటా, తన పాత్రలు చేసే ప్రతి చేతా ఆ కాలానికి అనుగుణమైనదై వుండాలి. అందువల్ల ప్రతి రచయిత సృష్టించే రచనలోనూ రెండురకాల కాలనియమాన్ని పాటిస్తాడన్నమాట: ఒకటి ఆంతర కాలగమనాన్ని సూచిస్తూ ఆయా పాత్రల మాటలమీద, చేష్టలమీద ఆధారపడి వుంటుంది. కథకు మాత్రమే పరిమితమైన యీ కాల నియమాన్ని పాటించే

రచనని ప్రతిష్ట కథానకం (micro-narrative) అనీ, - అలాకాక కథలోని సమయానికీ, మానవ చరిత్రలో దానికున్న సంబంధాన్ని నిర్ణయించే బాహిర కాల నియమాన్ని విస్తృత కథానకమనీ (macro-narrating) అనొచ్చు.

తన రచనలో నియమితమైన కాలపరిమాణాన్ని రచయిత మూడు విధాలుగా చెప్పొచ్చు. ఒకటి కథాకలానికి అసలు సంఘటనల కాలానికి తాదాత్మ్యతను సూచించడం. ప్రఖ్యాత గ్రీకు నాటక విమర్శకుడు అరిస్టాటిల్ నిర్దేశించిన Unity of time (ఐక్యత్రయంలోని 'కాలచక్రం') ఇదే! అసలు జీవితంలో రచయిత స్వీకరించిన సంఘటనల కాలం ఎంత వుంటుందో, రచనలో ఆ సంఘటనలను చూపే కాలాన్ని అంత పరిమాణానికే పరిమితం చెయ్యడం - నవలా రచనలో దీనిని ప్రశస్తంగా ఉపయోగించుకున్నవాడు James Joyce - తన యులిసిస్ నవలలో నాటక రచనలో దీన్ని తప్పుగా అర్థం చేసుకొని షేక్స్‌పియర్ నాటకాలనే పునర్నిర్మించే ప్రయత్నం చేశారు డ్రైడెన్ వంటి నాటకకర్తలు. కాని కాల నియమాన్ని - అసలు సంఘటనల కాలానికి పరిమితం చేసే ప్రయత్నం - కొంతలో కొంత - దువ్వూరి రామిరెడ్డి గారి 'కుంభరాణా' లోను, చలం 'సావిత్రి'లోను కనిపిస్తుంది. 'సావిత్రి'లో ఒక బుధవారం ప్రారంభమైన కథ, గురువారం రాత్రి పది గంటలకు ముగుస్తుంది. ఇందులో నాటకకర్త అలా దాదాపు 36 గంటల్లో ఎనిమిది రంగాలను నిర్దేశించడం చూస్తే ఇతివృత్తాన్ని ఎలా పరుగులెత్తించాడో తెలుస్తుంది.

ఆధునిక నాటకరంగంలో యీ సిద్ధాంతానికి తరచు విపర్యయం కలుగుతూనే వుంది. ఒక అతి యదార్థవాదం (naturalism) లో తప్ప మరో పద్ధతిలో నాటకాలు వ్రాసే రచయితలు యీ నాటకాల-సంఘటనా కాలాల తాదాత్మ్యతని అంగీకరించలేదనే చెప్పాలి.

రెండో పద్ధతి - కాలాన్ని హ్రస్వీకరించి రచన పూర్తి అయ్యేలోగా చాలా సంవత్సరాలను దొర్లించి వెయ్యడం. ఈ రెండు పద్ధతులను పరాస్తం చేసే మరొకటి : భూత భవిష్యద్వర్తమానాలను వర్ణమాలలో రంగు మార్చినట్లు తన యిష్టం వచ్చినట్లు రచయిత మార్చడం. ఇదే నవలల్లో ఎక్కువ ఉపయోగించే పద్ధతి. దీనిని నాటకాలలో కూడా విస్తృతంగా వాడుతారు రచయితలు.

ముందుచెప్పిన ఆంతర బాహిర కాల పరిమాణాన్ని నిర్దేశించడంలో చాలమంది నాటకకర్తలు బాహిరకాల నిర్దేశాన్ని జాగ్రత్తగా పరిశీలించరు. ముఖ్యంగా పౌరాణిక, చారిత్రక నాటకాల్లో యీ అవగాహన చాలా అవసరం. సంఘటనల పూర్వాపరాన్ని, కాలానుక్రమణికనీ క్రమబద్ధంగా నిర్వహించవలసిన బాధ్యతను చారిత్రక, పౌరాణిక నాటక రచయితలు అనుకున్నట్లు నిర్వహించారా అన్నది సంశయాస్పదమే! ఒక నాటకం ఏ కాలానికి చెందింది; ఆనాటి ఆచార వ్యవహారాలేమిటి? సంభాషణరీతి ఎటువంటిది? అవి యీ నాటకంలో నమ్మదగిన పద్ధతిలో ఉపయుక్తం చేయబడ్డాయా - అన్న విషయాలు పరిశీలనార్హాలు. రామరాజు నాటకంలో బళ్లారి రాఘవ పఠానుగా నటిస్తూ - ఆనాటి స్థితిగతులను, పద్ధతులను అత్యద్భుతంగా ప్రదర్శించేవాడు. గుర్రాన్ని కట్టినట్లు చూపడం, రొట్టెతింటూ ప్రవేశించడం, దూరంగా కూర్చుని కత్తినూరడం - వంటివి అటు కథాకాలానికీ, యిటు పాత్ర చారిత్రక స్థితికి వ్యాఖ్యానాలని చెప్పుకోవచ్చు.

అందుకు అపవాదంగా పాండవోద్యోగ విజయాల్లో కృష్ణుడు నీలిరంగు అంగీతోను, పాండవులు కాషాయాల్లోను, రారాజైన దుర్యోధనుడు మాత్రం పైన ఒక్క అంగవస్త్రంతోను కనిపించడం చూస్తే యీ విభిన్న

వస్త్రధారణంలో తర్క-బద్ధమైన కారణం ఉన్నదా అన్న సంశయం కలుగుతుంది.

నాటక సాహిత్యంలో మనకు సాధారణంగా ఎదురయ్యే కాల విభజన అంకాల ద్వారా తెలుస్తుంది. ఆ అంకాలను తిరిగి రంగాలుగా విభజించి చిన్న చిన్న రంగాల ద్వారా నాటక కథను నడిపించడం, కేవలం అంకాలుగా మాత్రమే విభజించి నాటకం వ్రాయడం కన్న తేలిక - అయినా అనేక రంగాలతో కాలాన్ని, సంఘటనలని చిన్న చిన్న ముక్కలుగా చేసి నాటకీకరిస్తే - నాటకంలో 'బిగి' తగ్గడం సాధారణంగా కనిపించే లోపం. ప్రయోగవిషయంలో అది మరింత కష్టసాధ్యం. కథావస్తువు దృష్ట్యా, ప్రయోజనం దృష్ట్యా, భాషా విప్లవం దృష్ట్యా అత్యుత్తమమైన కన్యాశుల్కం బహురంగ విస్తృతివల్ల, దానివల్ల బహువిధ శకలాలైన కాల పరిమాణం వల్ల - కత్తిరిస్తే తప్ప - ప్రదర్శన యోగ్యం కాలేకపోతున్నది.

అంకాలుగానో, రంగాలుగానో విభజించి వ్రాసే నాటకాలన్నింటిలోను మామూలుగా స్వీకరించేది linear timeనే! నిన్న, ఇవ్వాళ, రేపు అని ముందుకు సాగిపోతూ వుండే యీ కాలమానంలో అస్పష్టత అంటూ వుండదు. కాలగమనాన్ని, తద్వారా కథాగమనాన్ని ఒకేదిశలో నడిపిస్తుంది యీ పద్ధతి. అలాకాక కొన్ని ప్రయోగాల్లో గతానికి వర్తమానానికి, వర్తమానానికి భవిష్యత్తుకూ జరిగే సంఘర్షణల్ని చూపడం ద్వారా నాటక రచయితలు ప్రయోగ విధానంలోనే కాక భావవ్యక్తీకరణంలో కూడా కొత్త పద్ధతుల్ని చూపారు.

వర్తమానానికి భవితవ్యానికి మధ్య జరిగే సంఘర్షణలో ఊహాసౌధ నిర్మాణానికి ఎక్కువ ప్రాధాన్య ఉంటుంది. వర్తమానంలోని నిజంకన్న భవిష్యత్తులోని కలలు రమ్యంగా కనిపించడం, కలలు చెదిరి వాస్తవికత వెలుగులోకి రావడం యీరకం నాటకాలలో కథావస్తువు. అనిసెట్టి 'గాలిమేడలు' ఇటువంటి నాటకాలలో మొదటిది, ప్రశస్తమైనది కూడా. శ్రీవాత్సవ 'తీరని కోరికలు' ఇలాంటి ప్రయోగమే!

ఇంతకన్న గతం, వర్తమానం వీటి మధ్య జరిగే సంఘర్షణలో వివాదాత్మకమైన నాటక నైశిత్యం ఎక్కువ. గతాన్ని వర్తమానానికి వ్యాఖ్యానంగా నిర్దేశించే నాటకాలలో యీ నైశిత్యం పాలు ఎక్కువ. బెల్లంకొండ రామదాసు 'పునర్జన్మ'లో యిది ప్రత్యక్షంగా ఉంటే, బుచ్చిబాబు 'ఆత్మవంచన'లో యిది పరోక్షంగా ఉండి నాటకంలోని ప్రధాన పాత్రధారిణి చిత్తవృత్తిని విశదీకరించడానికి ఉపయోగించే పరికరమైంది. గతాన్ని, వర్తమానాన్ని సమాంతరాలుగా ఒకదాని పక్కన మరొకదానిని నడిపిస్తూ రెంటిలోనూ ఉండే అంతరాన్ని చూపడం జరిగింది యూజీన్ఓనీల్ రచన Beyond the Horizon ఆధారంగా గొల్లపూడి మారుతీరావు వ్రాసిన 'రాగరాగిణి'లో.

గతంలో జరిగిన సంఘటనల ప్రభావాన్ని చూపడానికి నాటక రచయిత ఎన్నుకొనే తేలిక సాధనం - ఒక పాత్రను గతంలోకి తీసుకుపోయి వదలడం - నాటకం వర్తమానంలోనే జరుగుతున్నా ఒక పాత్ర గతాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటూ, తనతోటి పాత్రల్ని కూడా గతంలోకి తీసుకుపోతాడు. భమిడిపాటి రాధాకృష్ణ 'కీర్తిశేషులు'లోను, రామదాసు 'మాస్టర్జీ'లోను, అవసరాల సూర్యారావు 'పంజరం'లోను యీ పద్ధతి చక్కని నాటక పరాకాష్టకు దోహదం యిచ్చింది.

నాటక పాత్రల గత, వర్తమాన జీవితాలని గురించి ఒక వ్యాఖ్యాత ప్రేక్షకులకు పరిచయం చేయడం - నవలా ప్రక్రియగురించి నాటకం తెచ్చుకున్న ప్రయోగ విధానం. సంస్కృత నాటకాల్లో కొంతవరకు, యక్షగానాదుల్లో చాలావరకు సూత్రధారుడు ఆయా పాత్రలతో సంభాషించినా, ఆయా పాత్రల నైతిక విలువల మీద వ్యాఖ్యానం

చెయ్యడు. ఆధునిక నాటకాల్లోని ప్రత్యక్ష పరిచయాల్లో యిటువంటి వ్యాఖ్యానం అంతర్గతంగా ఉంటుంది యస్.ఆర్. నంది వ్రాసిన మరో మొహెంజొదారో లోని పాత్రలన్నింటి మీద వ్యాఖ్యాత ద్వారా - రచయి చెప్పదలుచుకుంది గత - వర్తమానాలలోని అంతరం; ఆ అంతరంలో వ్యక్తమయ్యే ఆయా పాత్రల నైతిక నైజం

ఏకకాలంలో గతాన్ని వర్తమానానికి అంతరంగా చూపడానికి పూర్వరచయితలు, నేటి రచయితలు కూడ ఎన్నుకున్న మరో సాంకేతిక విధానం అంతర్నాటకం. నాటకంలో అంతర్నాటకాన్ని చూపి ఒక సత్యా ధృవీకరించడం అటు ఉత్తర రామ చరిత్రలోను, ఇటు Hamlet వంటి పాశ్చాత్య నాటకాలలోను జరిగింది అంతకన్న వర్తమాన సంఘటనలను వ్యాఖ్యానించే పద్ధతిలో జరిగిన ప్రయత్నాలు ఆత్రేయ 'విశ్వశాంతి'లోను నరసరాజు 'నాటకం'లోను జరిగాయి.

సంఘర్షణాత్మకమైన యిట్టి వైవిధ్యాన్ని చూపడానికి యీనాడు ఎన్నో దృశ్య, కాంతి ప్రసరణ విధానాల ఉపయోగిస్తున్నారు. వెలుగును సంకోచ, వికోచాల ద్వారా చూపడం, భిన్నమైన రంగ ప్రదేశాలను వేరువే ఎత్తుల్లో ఏర్పాటు చేయడం, తెరవెనుక 'నీడలు'గా గతంలోని పాత్రల్ని, వారికి ముందు మామూలు కాం ప్రసరణంలో వర్తమాన పాత్రల్ని చూపడం - యీ విధానాల్లో కొన్ని.

ఒకేరకమైన సంఘటనలు మూడు తరగతులకు చెందిన వ్యక్తుల మీద ఎలాటి ప్రభావాన్ని కలుగచేస్తాయో వివరించే గణేశ్‌పాత్రో తరంగాలు, మూడుతరాల వ్యక్తుల్లో ఎలాటి ప్రభావాన్ని కలగచేస్తాయో 'అతనిదే కొడుకు పుట్టాల', 'క్షీరసాగర మథనం'లో చూడొచ్చు.

ప్రతీకల ద్వారా స్థల కాల వివరాలని నిర్దేశించడం ఈనాటి నాటకాల్లో - ముఖ్యంగా నాటికల్లో - ఎక్కువ చూడొచ్చు. వీరేంద్రనాథ్ 'రుద్రవీణ'లో యిటువంటి ప్రయోగం జరిగింది. అతనిదే 'చరిత్ర'లో వెలు చీకట్లను alternate చేసి జరుగుతున్న చరిత్రకి భాష్యం చెప్పిస్తాడు రచయిత.

కాలాన్ని అతి ప్రతిభావంతంగా వాడుకున్న నాటకం యూజీన్ ఓనీల్ ''ఎంపరర్ జోన్స్''. భూ భవిష్యద్వర్తమాన కాలాల పరస్పర విరుద్ధమయిన గమనాన్ని చూపడం దీని ప్రత్యేకత. మూలంలో లేని మరో వినూత్నమైన అంశాన్ని తెలుగుసేతలో చూపారు అనుసరణకర్త నాగభూషణశర్మ. ఇందులో ప్రవేశపెట్టిన జానప కళారీతులు, వాటికి విరుద్ధంగా నాటకంలో జరిగే సంఘటనల వర్తమానం. కథనం పాటలలోను, నాట సంఘటనలు వర్తమానంలోను జరిగి కథావస్తువులోని అంతస్సంఘర్షణని అత్యుత్తమంగా చూపారాయన.

అలాగే ఒక levelలో ఉంచబడ్డ పాత్రలు మాట్లాడడం, మరో levelలో ఉన్నవారు మూకాభినయం (mime) చెయ్యడం - ఎ. ఆర్. కృష్ణ చేసిన మాలపల్లి ప్రదర్శనలో విస్పష్టంగా కనిపిస్తుంది. శశిమోహన్ వ్రాసి 'కోహినూర్'లో దీన్ని నాటక పరాకాష్టకు దోహదం యిచ్చేవిధానంగా తీర్చిదిద్దాడు రచయిత.

ఈవిధంగా మామూలు సమయాన్ని నాటక సమయంగా మలుచుకోవడంలో ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న అనేక ప్రయోగాలల్లో కొన్ని తెలుగులో కూడా విజయవంతంగా జరిగాయనడం నిర్వివాదం. కొన్ని కేవలం తెలుగులోనే అనుసరించిన విధానాలు కూడా లేకపోలేదు. అయితే, అన్ని కాలాల్నీ వర్తమానీకరించే రసాయ ప్రయోగం నాటకం కనుక దానిలో బహుముఖ సమయ విన్యాసాన్ని, సూచించే వినూత్న పద్ధతుల ఆవిష్కారాని సాధనాలయ్యే పటిష్టమైన ప్రయోగాలను తెలుగు నాటక రచయితలు కూడా చేయగలరని నా ఆశంస.